క్లుప్తంగా

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ నుంచి ముడుమాల గ్రామం వరకు చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గత వారం పనులు ప్రారంభమయ్యాయి. పోలకల్ గ్రామం నుంచి మొదలైన రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు, చదును పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం వైఎస్సార్‌సీపీ సి.బెళగల్ మండల మాజీ కన్వీనర్ నరసింహుడు, నాయకులు పులిరాజు, బాలరాజు, సామప్ప పరిశీలించారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం పదిలం



బీసీ హాస్టల్ విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యసిబ్బంది

సి.బెళగల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ మంజుల అన్నారు. శనివారం స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. వసతిగృహ సంక్షేమ అధికారి రమేష్, ఆశావర్కర్లు రాజకుమారి, ఉషారాణి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు టీకాలు



పశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: అడవుల్లో ఉండే వన్యప్రాణుల సంరక్షణ కోసం గ్రామాల్లోని పశువులకు టీకాలు వేస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆలమూరు గ్రామంలో అటవీ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని జీవాల వల్ల వన్యప్రాణులకు వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అనంతరం రైతులకు మందులను అందించారు. సర్పంచ్ ముల్లా మహ్మద్‌షరీఫ్, డీఆర్‌ఓ చంద్రహాస్, పశుసంవర్ధకశాఖ ఏడీ కమలాకర్, వైద్యురాలు సులోచన, ఎఫ్‌బీఓ జమాల్‌వలి, మహేష్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి సారె సమర్పణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోడుమూరు రూరల్: కోడుమూరులో శ్రీచౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని మేజర్ గ్రామ పంచాయతీ తరఫున అమ్మవారికి శనివారం సారెను సమర్పించారు. పంచాయతీ భవనం నుంచి అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శనివారం నంది ధ్వజావ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం దేవి రథోత్సవాన్ని నిర్వహించేందుకు అటగార దేవాంగ దైవచార సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు.

నేడు సారె సమర్పించనున్న నేతలు

శ్రీచౌడేశ్వరీదేవికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ఆదివారం ఉదయం సారె సమర్పించనున్నారని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైద్యవృత్తిలో సేవే ప్రధానం

కర్నూలు (టౌన్) : వైద్యవృత్తిలో సేవే ప్రధానమని, ఈవిషయాన్ని వైద్యులు గుర్తించుకోవాలని కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి అన్నారు. శనివారం ఆత్రిలోని న్యూ లెక్చరర్ హాలులో హౌస్ సర్జన్లతో మెడికల్ కౌన్సిల్ ఎథిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగి వచ్చిన సమయంలో నూతన వైద్యులు జబ్బు గురించి వివరించాలన్నారు. వృత్తిలో ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎంత మందికి సేవ చేశామన్నదే ముఖ్యమన్నారు. అనంతరం 2 కే 19 బ్యాచ్ హౌస్‌సర్జన్లకు ఎథిక్స్ సర్టిఫికెట్లు అందజేశారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ చిట్టి నరసమ్మ, డాక్టర్ రేణుకా పాల్గొన్నారు.

పల్లెలోనే పంట కొనుగోళ్లు

- రవాణా ఖర్చులు ఆదా
- మద్దతు ధరకే పంట విక్రయించుకునే అవకాశం
- బయటి మార్కెట్ కంటే ఎక్కువ ధర
- ఇప్పటి వరకు 280 టన్నుల కొనుగోలు
- అన్నదాతలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

మండలంలోని పంట కొనుగోలు కేంద్రాలు
బిలకలగూడూరు, పెసరవాయి,కరిమద్దెల
చిందుకూరు, కొరటమద్ది

విత్తు వేసింది మొదలు పంట చేతికొచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడుకోవడం ఒక ఎత్తైతే.. పంటను విక్రయించుకోవడం మరో ఎత్తు. పట్టణాలు, నగరాల్లోని మార్కెట్‌కు తరలించాలంటే గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం ఉండేది కాదు. ఒకవేళ ఉన్నా వాహనాల బాడుగ భరించాల్సి వచ్చేది. ఒక్కోసారి ధర లేక వచ్చిందంతా బాడుగలకే సరిపోయేది. ఇదంతా గతం. ఇప్పుడు రైతన్నలను జగనన్న ప్రభుత్వం రాజులను చేస్తోంది. వారి కష్టాలను ఒక్కోటిగా తొలగిస్తోంది. పంట సాగుకు ఆర్థిక సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చుతోంది. గ్రామాల్లోనే మార్కెట్లను ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంటను కొనుగోలు చేస్తూ అన్నదాతకు అండగా నిలుస్తోంది.



బిలకలగూడూరులో జొన్నలను తూకం వేస్తున్న సిబ్బంది



కరిమద్దెలలో జొన్నల నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ

గడివేముల: గతంలో పంటలను విక్రయించుకోవాలంటే అన్నదాతలకు తలకు మించిన భారంగా ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యలకు పరిష్కారం చూపింది. గ్రామాల్లోనే పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తోంది. రైతులు తమ దిగుబడులను గ్రామాల్లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకుంటున్నారు. రవాణా ఖర్చు మిగులుతుండడం, మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న వారం దరూ ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు, పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, కొరటమద్ది గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జొన్నలు బయట మార్కెట్‌లో రూ.2,500నుంచి 2,700వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటా రూ.3180 మద్దతు ధర ప్రకటించడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకుంటున్నారు. వ్యాపారుల కంటే ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతలు ముందుకు వస్తున్నారు. రవాణా, సంచులకు అయ్యే ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది.

మంచి స్పందన ఉంది

కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు జొన్నలు 280 టన్నులు కొనుగోలు చేశాం. బిలకలగూడూరు కేంద్రంలో 130, చిందుకూరు 50, కరిమద్దెల 1300 టన్నులు కొనుగోలు చేశాం. ఇంకా ఎవరైనా రైతులు దిగుబడులు విక్రయించుకోవాలనుకుంటే ఆర్బీకేలలో పేర్లను నమోదు చేసుకోవాలి.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

100 క్వింటాళ్లు అమ్ముకున్నా



ఐదు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.18 వేల చొప్పున 5 ఎకరాలకు సుమారు రూ.90 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.3,180 మద్దతు ధరతో అమ్ముకోగా రూ.3,18,000 వచ్చింది. బయటి మార్కెట్ కంటే ప్రభుత్వం ఎక్కువ ధరతో కొనుగోలు చేయడం ఆనందంగా ఉంది.

–అమర్‌నాథ్‌రెడ్డి, రైతు, కరిమద్దెల

బయటి మార్కెట్ కంటే ఎక్కువ రేటు



రబీ సీజన్‌లో నాకున్న ఐదు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. స్థానిక ఆర్బీకే సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేశారు. దీంతో మద్దతు ధర లభించింది. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దళారి వ్యవస్థ ఉండదు. మా కల్లంలోకే వ్యవసాయాధికారులు వచ్చి పంటను పరిశీలించారు. తూకాలు వేసి కొనుగోలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లోనే నేరుగా మా అకౌంట్లోనే డబ్బులు వేస్తున్నారు.

– వెంకటేశ్వరరెడి, రైతు, కరిమద్దెల

రైతు ప్రభుత్వం



గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతన్నలు ముందుకు వస్తున్నారు. జొన్న, పప్పు శనగ కేంద్రాలకు రైతుల నుంచి స్పందన బాగుంది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతుల జీవితాలు బాగుపడుతున్నాయి. రైతులు వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు.

– శిరుప శ్రీనివాసరెడ్డి,
నంద్యాల జిల్లా వ్యవసాయ విభాగం అధ్యక్షుడు

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.201 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

కర్నూలు సిటీ: వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ థియరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా అన్నారు. శనివారం టౌన్ మోడల్ కాలేజీలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు తదితరులతో పరీక్షల నిర్వహణపై వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, తాగు నీరు, లైట్లు, ఫ్యాన్లు, డెస్కులు లేకుండా చూసుకోవాలన్నారు. కేంద్రంలోకి ఎలక్ట్రిక్ వస్తువులకు అనుమతించరాదన్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టిస్ జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించకూడదన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. సమావేశంలో డీఈసీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభు చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ రథసారథులు



ప్రశంసా పత్రాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్‌లోని వలంటీర్లకు సన్మానం



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

కర్నూలు (న్యూటౌన్): ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు సంక్షేమ పథకాల రథసారథులని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్‌లోని నిర్మల్‌నగర్ పార్కులో 16 వార్డులకు సంబంధించి 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న నవరత్నాలను అర్హులందరికీ చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి సత్కరించడం గొప్ప విషయమన్నారు. అనంతరం వలంటీర్లకు సేవావజ్ర, సేవామిత్ర పురస్కారాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీసీఏబీ చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శారద, సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, సాన శ్రీనివాసులు, చిట్టెమ్మ, నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమశంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, కర్నాటి పుల్లారెడ్డి, ధనుంజయ ఆచారి, వీరయ్య, యూనుస్, షరీఫ్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం





వ్రతం చేయిస్తున్న పురోహితులు, హాజరైన భక్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని మల్లాపురంలో ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలు జరిగాయి. మాఘ పౌర్ణమి సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 మంది జంటలు పాల్గొన్నాయి. పురోహితుడు విశ్వేశ్వర శర్మ, రాముడు, వీరేష్‌కుమార్ మంత్రోచ్చారణ మధ్య వ్రత పూజలు నిర్వహించారు. అవసరమైన పూజా సామగ్రిని టీటీడీ సమకూర్చింది. సామాజిక సామరస్యత నెలకొల్పేందుకు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలను జరుపుతున్నామని నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, రాఘవేంద్రారెడ్డి, సోమేశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి, మద్దిలేటిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నరసింహులు, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉపాధి హామీ పథకం అమలు

- సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకాన్ని తాము పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువులు, కాలువల పూడిక తీత పనులను పూర్తిగా తగ్గించి మిగిలిన పనులను చేపట్టేలా ప్రణాళికలు వేసుకున్నట్లు చెప్పారు. వేసవిలో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీసర్వేకు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయని, స్టోన్ ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేస్తామని అందుకు సంబంధించిన నివేదికలు పంపుతామని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, సీపీఓ హిమ ప్రభాకరరాజు, డీఆర్‌డీఏ పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్
- ముడుమాలలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామంలో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.32 కోట్లతో కొత్తకోట గ్రామం నుంచి తిమ్మందొడ్డి గ్రామం వరకు (17 కి.మీ) నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన నేతలకు మండల ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాలకు బీటీరోడ్డు నిర్మాణాలకు అనుమతులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటోందని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, వైస్ ఎంపీపీ నాయకంటి మంగమ్మ, కర్నూలు, గూడూరు జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నబాబు, మౌలాలి, సర్పంచ్‌లు బతుకమ్మ, ఇమ్మానియేల్, ఎంపీటీసీ సభ్యుడు నడిపి సోమన్న, పార్టీ నాయకులు చిన్నకొండన్న, నరసింహుడు, బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, పులిరాజు, రవిప్రకాష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, బాలరాజు, మద్దిలేటి, రాఘవేంద్ర, శేషిరెడ్డి, సంపత్, సుంకన్న, నాగరాజు, జయరాజు పాల్గొన్నారు.

పార్టీ నాయకులకు పరామర్శ



లక్ష్మీదేవమ్మ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సతీష్

సి.బెళగల్: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. కొండాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ పెరాలసిస్‌తో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న సతీష్ శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అదేవిధంగా సి.బెళగల్‌కు చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు ముల్లా హారున్‌రషీద్ తండ్రి ముల్లా షకూర్‌ను పరామర్శించారు. ఆయనతో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సంపత్ ఉన్నారు.

27న డయల్ యువర్ డీపీటీఓ

కర్నూలు (సిటీ) : ఈనెల 27వ తేదీన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఏవైనా బస్సు రవాణా సంబంధ సమస్యలుంటే ప్రయాణికులు 9959225787కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) టి.శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఘర్షణలకు తావు లేకుండా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ ఎంఆర్‌ఓ మోహన్, నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం



బిలకలగూడూరులో రైతు భరోసా కేంద్రం

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన నిధులతో వేసిన సీసీరోడ్లు, డ్రైనేజీలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

స్థానికంగానే ఉపాధి పనులు

గూడూరు రూరల్: కూలీలు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఏపీఓ హసీనా అన్నారు. కె.నాగలాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో వ్యవసా య పనులు తగ్గిపోవడంతో గ్రామాల్లో ఉపాధి పనులను పెంచినట్లు తెలిపారు. ప్రతి కూలీకి పని కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కూలీలు వలసలు వెళ్లకుండా స్థానికంగానే పనులు చేసుకోవచ్చని చెప్పారు. సూచించిన కొలతల ప్రకారం చేస్తే పూర్తి స్థాయి వేతనం అందుతుందని తెలిపారు.

రామయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కామ్రేడ్ చదువుల రామయ్య పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ అన్నారు. శనివారం చదువుల రామయ్య 32వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెత్తందారులు, పెట్టుబడిదారుల వ్యవస్థపై తిరుగుబాటు చేసి పేదలకు న్యాయం చేశారని తెలిపారు. నాయకులు శేషు, దూళ్ల భాస్కర్, ఆటో మధు, రంగస్వామి, అక్బర్‌బాషా పాల్గొన్నారు.